క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..



వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్సై ఫక్రుద్దీన్, సిబ్బంది

వీరఘట్టం: మైనర్లుగా ఉన్న తమ పిల్లలకు తల్లిదండ్రులు బైక్‌లు లేదా కార్లను ఇవ్వొద్దని ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ సూచించారు. శుక్రవారం స్థానిక గ్రోమోర్ సెంటర్‌లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని పలువురికి అపరాధ రుసుం విధించారు.

ఐటీడీఏ పీఓను కలిసిన ఉద్యోగులు



పీఓకు స్వాగతం పలుకుతున్న జీసీసీ మేనేజర్లు కృష్ణ, నరసింహులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు, మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, ఈఈ సింహాచలం, గిరిజన సహకార సంస్థ మేనేజర్లు దాసరి కృష్ణ, జి.నరసింహులు, ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్‌డీ రాధాకృష్ణ, డిప్యూటీఈఓ నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, తదితరులు పీఓను కలిసిన వారిలో ఉన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజాభాగస్వామ్యంతో తగ్గించాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ప్రధాన మార్కెట్‌లోని వ్యాపారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. దుకాణాలకు వచ్చే వినియోగదారులకు సరుకులు, వస్తువులు అందించే క్రమంలో వాడుతున్న పాలిథిన్ కవర్లను పూర్తిగా నిషేధించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే అపరాధ రుసుం విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

అక్రమ రవాణాపై నిరంతరం నిఘా



ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

గుమ్మలక్ష్మీపురం: గంజాయి, లిక్కర్, గుట్కా, సారా వంటివి అక్రమ రవాణా జరగకుండా ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద 24/7 నిఘా ఉంచుతున్నట్లు ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఎల్విన్‌పేటలో చెక్‌పోస్టును శుక్రవారం ఆయన పునఃప్రారంభించారు. చెక్‌పోస్టు మార్గం మీదుగా ఆంధ్ర – ఒడిశా వైపు వచ్చీపోయే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాలున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అక్రమ రవాణా జరగకుండా తమ సిబ్బందితో కలిసి తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నట్లు చెప్పారు. అనుమానితుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న అర్బన్ వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో విద్యార్థులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ వి.హరగోపాల్ అన్నారు. అర్బన్ హెల్త్‌సెంటర్ నేతృత్వంలో కళాశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించి, సుమారు మూడు వందల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామింగ్ అధికారి వెలమల అప్పారావు, పీడీ నాగభూషణరావుల నేతృత్వంలో వైరల్ జ్వరాలు, అంటు వ్యాధుల నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను నినదిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది బీవీ రమణ, జాడ శివప్రసాద్, విశ్వనాథం, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే సాగు ఎలా..?



నాగావళి ఎడమ కాలువలో అచ్చెపువలస వద్ద అరకొరగా వస్తున్న నీరు

- తోటపల్లి ఎడమ కాలువలో నీటి ప్రవాహం అంతంతమాత్రమే
- మల్లివీడు వద్ద పాడైన సైఫూన్
- ఆందోళనలో రైతన్నలు



అచ్చెపువలస వద్ద ఊబాలు జరగక ఖాళీగా ఉన్న పొలాలు

వీరఘట్టం:

తోటపల్లి ప్రాజెక్ట్ ఎడమ కాలువలో నీరు అంతంతమాత్రమే ఉండడంతో ఖరీఫ్ సాగు ఎలా చేపట్టేదని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నెల 13న తోటపల్లి జలాశయం ద్వారా పాత ఆయకట్టుకు ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేశారు. అయితే ఇంత వరకు కాలువ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల కిందట ఎడమకాలువ పరిధిలోని మల్లివీడు వద్ద ఉన్న సైఫూన్‌కు రంధ్రం పడడంతో పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయలేకపోయామని జలవనరుల శాఖాధికారులు చెబుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో అడపాదడపా కొంతమంది రైతులు ఆ నీటితో ఊబాలు చేపట్టారు. ప్రస్తుతం కాలువ గుండా అడుగు మేర నీరు వస్తుండడంతో బ్రాంచ్ కెనాళ్లకు నీరు ఎక్కడం లేదు. దీంతో కాలువ పరిధిలో ఉన్న ఆయకట్టు భూముల్లో ఊబాలు చేపట్టలేక రైతులు దిగాలు చెందుతున్నారు. పాలకొండకు ఎగువన ఉన్న వీరఘట్టం మండలంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే దిగువ ప్రాంతాల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని రైతులు అంటున్నారు. జలవనరుల శాఖాధికారులు సత్వరం చర్యలు చేపట్టి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పలువురు జలవనరుల శాఖాధికారుల వద్ద ప్రస్తావించగా మల్లివీడు వద్ద ఎడమ కాలువలో సైఫూన్‌కు మరమ్మతులు చేపట్టామని, మరో రెండు రోజుల్లో శివారు ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని చెప్పారు.

నారు ముదిరిపోయింది ..



ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కి చేపట్టాను. ఇంతలో కాలువ నీరు వస్తే ఊబాలు చేపడదామని అనుకున్నాను. నాకున్న ఎకరన్నర పొలంలో ఊబాలు చేద్దామంటే నీరు లేదు. మరో పక్క నారు ముదిరుపోతోంది. నారు ముదిరిపోతే ఇంతవరకు పెట్టిన పెట్టుబడి, నేను పడిన శ్రమ అంతా వృథా అవుతుంది. అధికారులు స్పందించి త్వరగా నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. పి.శ్రీను, రైతు, వీరఘట్టం

కిచెన్ గార్డెన్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలి

- ఎంపీడీఓ రామకృష్ణ



అంపిలిలో కిచెన్‌గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, తదితరులు

పాలకొండ రూరల్ : కిచెన్ గార్డెన్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అంపిలి, అన్నవరం, తంపటాపల్లి, తుమరాడ, అట్టలి, రాజుపేట, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి, ఖాళీ స్థలాల్లో సాగు చేస్తున్న కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించారు. తోటల పెంపకంపై విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలు



అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: చిన్నారుల అభివృద్ధి, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా కార్యకర్తలు నడపాలని మండల ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని బుక్కూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం అక్కడే ఉన్న సచివాలయాన్ని సందర్శించారు. ఈయన వెంట ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ కె.సూర్యనారాయణ, కార్యకర్త హిమప్రభ, తదితరులున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



కొమరాడ: కాలువలు వద్ద పిచ్చిమొక్కలు తొలిగిస్తున్న ఎంపీడీఓ తదితరులు



గరుగుబిల్లి: రావివలసలో పారిశుద్ధ్య ర్యాలీ

గరుగుబిల్లి: దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. మండలంలోని రావివలస, కారివలస, లఖనాపురం, నాగూరు, ఉల్లిబద్ర తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, వైద్యాధికారి సంతోష్‌కుమార్, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కొమరాడ: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ మల్లికార్జునరావు అన్నారు. మండల కేంద్రం కొమరాడలో డ్రైడే కార్యక్రమంలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మండల పరిషత్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



వీరఘట్టం: జేసీబీతో కాలువలోని చెత్త తీస్తున్న దృశ్యం



పాలకొండ: పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

వీరఘట్టం: పారిశుధ్య పక్షోత్సవాలు సందర్భంగా మండలంలోని విక్రమపురంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. జేసీబీ సహాయంతో మురుగు కాలువలను శుభ్రం చేశారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, సీఏఫ్‌లు సంయుక్తంగా ఈ పనులను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సిబ్బందికి సూచించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి..

పాలకొండ: నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాల కారణంగా పట్టణంలో చెత్త పేరుకుపోయిందని తెలిపారు. గ్రంథాలయ సమీపంలో చెత్త పోగులపై ఫిర్యాదులు రావడంతో అక్కడ నుంచి చెత్తను తరలించామని వివరించారు.

డ్రై డే పాటించాలి..

సీతంపేట: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఈఓపీఆర్‌డీ కె.సత్యం అన్నారు. మండలంలోని కేపీ ఈతమానుగూడలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యత ..

పాలకొండ రూరల్: పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యతని తుమరాడ సర్పంచ్ పి.శోభారాణి అన్నారు. పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అనారోగ్యం సోకిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈమె వెంట సచివాలయ, గ్రామీణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం..

భామిని: పిల్లల ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా రవాణా శాఖాధికారి, శానిటేషన్ స్పెషలాఫీసర్ ఎం.శశికుమార్ అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రం, కేజీబీవీలను ఎంపీడీఓ కొవ్వాడ కిశోర్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత ఆరోగ్యంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ చందన్‌పట్నాయక్, అంగన్‌వాడీ ఎస్ఓ సబితా పట్నాయక్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సిద్ధం

వీరఘట్టం: వచ్చే నెల మొదటివారంలో జరగనున్న సోషల్ ఆడిట్‌కు ఉపాధి హామీ సిబ్బంది సిద్ధమవుతున్నారు. గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ జరగనుందని ఏపీఓ సత్యంనాయుడు తెలిపారు. ఆడిట్‌బృందాలకు పూర్తి సమాచారం అందించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

కార్గిల్ వీరులకు జోహార్లు



వీరఘట్టం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడిన కళాశాల విద్యార్థులు

వీరఘట్టం: పాతికేళ్ల కిందట జూలై 26న జరిగిన కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు స్థానిక గాయత్రీ విద్యాసంస్థల విద్యార్థులు జోహార్లు అర్పించారు. ఈ మేరకు మండల కేంద్రంలో కార్గిల్ దివస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. 1999లో పాకిస్తాన్‌తో కార్గిల్‌లో భారత్ వీరజవాన్లు వీరోచితంగా పోరాడి పాక్ బలగాలను తరిమికొట్టారని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై షేక్ ఫక్రుద్దీన్, కళాశాల కరస్పాండెంట్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

– నివాళులు..



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం

భామిని: దేశరక్షణ కోసం అశువులు బాసిన కార్గిల్ వీరులకు స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. కొవ్వొత్తులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో అధ్యాపకులు, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ దినోత్సవం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా శిబిరం ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం జరిగింది. యుద్ధంలో ప్రాణాలర్పించిన వీర సైనికులకు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ త్రినాథ్, తదితర అధ్యాపకులతో కలిసి విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పార్వతీపురం టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పెంట భానుమూర్తి అన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను కొందరు అధికారులు అమలు చేయకుండా నిబంధనలు పక్కనపెట్టి ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్న విధానాన్ని మానుకోవాలన్నారు. సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సెక్రటరీ బి.కృష్ణమూర్తి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధ వస్తువులపై నిఘా

కొమరాడ: గంజాయి, అక్రమ మద్యం తదితర నిషేధ వస్తువుల రవాణాపై పక్కాగా నిఘా పెట్టామని ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యంతో పాటు గంజాయి, గుట్కా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వసతిగృహం పరిశీలన



వనజ వసతిగృహంలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ

జియ్యమ్మవలస: మండలంలోని వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను వైద్య సిబ్బందితో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా పడుతున్నందున విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బీజేపురం ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

తహసీల్దార్‌కు ఆత్మీయ వీడ్కోలు



బదిలీ అయిన తహసీల్దార్ రామారావుకు జ్ఞాపికలు అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల సమయంలో జరిగిన బదిలీల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌గా విధుల్లో చేరిన బి.రామారావుకు ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో అధికారులు తిరిగి యథాస్థానానికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో రిలీవ్ ఆయనను మండల రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను సత్కరిస్తూ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.చంద్రశేఖర్, ఉప తహసీల్దార్ రాజేంద్ర, ఆర్ఐ గిరి, వీఆర్వోలు పాల్గొన్నారు.

రక్తపరీక్షలు చేయండి



బల్లగూడలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: మండలంలోని బల్లగూడ, చినగోర కాలనీల్లో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాలను ఎంపీడీఓ ఎంవీవీ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. జ్వర పీడితులందరికీ రక్త పరీక్షలు చేయాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి సూచించారు. ఎపిడిమిక్ సీజన్ ప్రారంభమైనందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

విద్యలో ఉన్నతంగా రాణించాలి



కేజీబీవీలో విద్యార్థులకు సూచనలిస్తున్న గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులంతా చదువులో ఉన్నతంగా రాణించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బొత్తాడ గౌరీశంకరరావు అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, వంటశాల, పరిసర ప్రాంతాలు, గార్డెన్, క్రీడా మైదానాలతో పాటు నాడు నేడు పథకం ద్వారా చేపడుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. నూతనంగా ప్రవేశాలు పొందిన ఆరో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పరిసర గ్రామాల నుంచి వచ్చి పాఠశాలలో ప్రవేశం పొందారని, అశ్రద్ధ చేయకుండా చదువే లక్ష్యం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాముడుగూడలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి ప్రజ్ఞ

కురుపాం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బి.ప్రజ్ఞ అన్నారు. మండలంలోని జి.శివడ పంచాయతీ రాముడుగూడ గిరిజన గ్రామంలో వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు .జ్వరాలతో ఉన్న వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. పొలం పనులకు వెళ్లే వారు పాము కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు వహించాలని, మొండెంఖల్ ఆస్పత్రిలో పాముకాటుకు, కుక్క కాటుకు వ్యాక్సిన్స్ అందుబాటులోనే ఉన్నాయన్నారు. వైద్య శిబిరంలో మొండెంఖల్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు సత్యరాజ్, భారతి, నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు అరుణ, సుఖవాసి, హెల్త్ అసిస్టెంట్లు జె.తిరుపతిరావు, దివాకర్, ఆనంద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: గతంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ నిధులను విడుదల చేయాలని స్థానిక ఎంపీపీ బి.ఆదినారాయణతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ద్వారా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే ప్రారంభించని రహదారి పనులు కూడా ప్రారంభించాలని సూచించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన మంచినీటి పనులకు బిల్లులు చెల్లించాలని, ఎన్ఆర్ఈజీఎస్ పనులకు వేతనాలు మంజూరు చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్.మోహనరావు, ఎస్.రాము, వెంకి, రమేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

- డీఆర్‌సీ సమన్వయకర్త శ్రీనివాస్, సహాయ సంచాలకురాలు రత్నకుమారి



వీరఘట్టం: కిమ్మిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

భామిని: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) సమన్వయకర్త ఆర్.శ్రీనివాస్, పాలకొండ సహాయ సంచాలకురాలు కె. రత్నకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఏఓ కొర్ను సింహాచలం, ఎస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ మహేష్ సారథ్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తక్కువ వర్షాలు కురుస్తున్నందున రైతులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. కందులు, రాగులు, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం గురండిలో వరినాట్లు వేస్తున్న పొలంలో రైతులకు పొలంబడి నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎర్రన్న, దుర్గాప్రసాద్, ఎలీసా, భవానీ, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

– ఆరోగ్యకరమైన పంటలు

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. మండలంలోని విక్రమపురం, కిమ్మి గ్రామాల్లో విత్తనోత్పత్తి, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రైతులు సొంతంగా విత్తనాలు ఎలా తయారు చేసుకోవచ్చో వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏలు శ్రీనివాసరావు, శారద, భారతి, రత్నకుమారి, ఏఓ జె.సౌజన్య, రైతులు పాల్గొన్నారు.



బామిని: పొలంబడిలో భాగంగా విత్తనాభివృద్ధిపై సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు